# నా సంగీతం చదువు

## ౧

నేను పాడతాను. "మంచిపాట వింటూ తన్మయుడు అవుతాడు, మంచిపాట పాడుతాడు" అని నన్ను గురించి ఆ మధ్య ఎవరో అన్నారు. నేను శ్రావ్యంగా పాడగలను. అయినా నేనొక గాయకుడనని కాని, పాటకచేరీలు చేయగలిగిన శక్తి సామర్థ్యాలు నాకు ఉన్నాయనికాని చెప్పుకోవడం భావ్యంకాదు. పై పెచ్చు తప్పు. నేను సంగీతం అభ్యసించలేదు. శాస్త్రబద్ధమైన సంగీతంలో నాకు ప్రవేశంలేదు. అనుకరించడంలో నేర్పుకలిగిన నటుడు ఏవిధంగా అయితే కొంత ప్రయత్నంతో సంగీతంకూడా పాడగలడో అదే విధంగా నేనుకూడా శాస్త్రీయమైన సంగీతం అనుకరించగలను. అంతమాత్రంచేత నేనొక గాయకుడ ననుకోవడం ఎలాగ?

సంగీతంలో అభిరుచి ఉండి, శ్రావ్యంగా పాడగలిగిన శక్తికూడా ఉన్న నేను గాయకుడు కాకుండాపోవడం చాలామందికి అట్టే అంత అవసరమైన విషయం కాకపోయినా కొందరికయినా ఆశ్చర్యం కలిగించవచ్చు. అందులోనూ అట్టి అభ్యాసం చేయడానికి తగిన ఆర్థికస్తోమత ఉండి, తల్లిదండ్రుల సమ్మతి లభించి, ప్రోత్సాహంకూడా ఉన్నదని నేను

చెప్పినప్పుడు వారి ఆశ్చర్యం అధికం కావచ్చు. ఆ కొలది మందికోసం నేను శాస్త్రీయసంగీతం ఎందువల్ల అభ్యసించ లేకపోయానో చెబుదామని ఉంది, మీరుకూడా వినవచ్చు.

చిన్న తనంలో ప్రతిబాలుడు కూనిరాగాలు తీయడం మొదలు పెట్టుతాడు. అంత వరకు చెప్పుకోదగిన ప్రత్యేకత ఏమీలేదు. కొందరి కూనిదీర్ఘాలు పుట్టుకలోనే మాడి పోతవి. మరికొందరు వికారంగా ఉన్నా సమాజంలో ప్రతి వారికి సంగీతంపై ద్వేషం పుట్టేటట్లు చేయడం కోసమా అన్నట్లుగా తమ కూనిరాగాలు జీవితాంతంవరకు సాగిస్తారు. మరికొందరి కూనిరాగాలు వినసొంపుగా ఉండి ఇతరుల ఆసక్తి చూరగొని, వారి ప్రోత్సాహం సంపాదించుకొనడానికి కూడా కారణమౌతవి. బహుశా నా కూనిరాగాల స్వభావం ఇలాంటి వాటిలో చేరుతుందేమో! నాకు ఇంటా బయటాకూడా విశేషమైన ఆదరాభిమానాలు, ప్రోత్సాహము సంపాదించి పెట్టినవి.

౨

నా సంగీతం చరిత్ర మా చిన్నన్నయ్య ఒడుగులో ప్రారంభమైయింది. నేనంతవరకు ప్రజలఎదుట పడలేదు. మా చిన్నన్నయ్య మా కన్న అయిదారు సంవత్సరాలు పెద్ద. తరువాతవాణ్ణి నేనేమో నన్ను తోడి పెళ్ళికొడుకునుచేశారు. లబ్ధి ఆట్టే లేకపోయినా తోడిపిల్లలలో గౌరవ మర్యాదలు అధికమైనవి.

ఆ రాత్రి భోజనాలు జరుగుతున్నవి. ఆ రోజుల్లో పద్యాలు, రాగాలాపానలు, గోవిందనామస్మరణలు లేకుండా శుభకార్యాలలో భోజనాలు జరిగేవికావు. యథా విధిగా ఒకరిద్దరు హేమాహేమీలవంటి గాయకులు, మా వశిష్ఠమహర్షి సత్యనారాయణశాస్త్రిగారు వంతులు వేసుకుని రసవత్తరమైన తెలుగు పద్యాలు, శ్లోకాలు వినిపించారు. అరిగి కడుపులో ఏర్పడిన ఖాళీ భర్తీచేసుకోవడంలో నిమగ్ను లయ్యారు. అంతలో మా బంధువుల పిల్లలలో ఒకడు అంత వరకు ఆటపాటలలో నాకు ప్రత్యర్థిగా నాతో సమాన ఉజ్జీగా ఉంటున్న మా వేణుగోపాలుడు స్వతంత్రించి ఒక పద్యం పాడేశాడు. బాగానే చదివాడేమో అందరూ హర్షిం చారు. మళ్ళీ ఇంకొకటి చదవమన్నారు. చదివాడు. కుర్ర వాడి గొంతుక గురించి, భవిష్యత్తులో వాడికి పట్టబోయే అదృష్టం గురించి చర్చవచ్చింది.

మా ఆఖరి మేనమామ, గ్రామకరణీకం చేసుకుంటు న్నాడు. కుటుంబ గౌరవానికి, పౌరుషానికి ఎక్కువ ప్రాముఖ్యం ఇచ్చే రకం మనిషి. మా తండ్రివైపువారి పిల్లవాడికి అంత కీర్తిరావడం పౌరుషం రేపింది. నేనంటే కొంత ప్రత్యేకమైన అభిమానం కూడా ఉంది. కుటుంబ గౌరవం నిలబెట్టుకోవడం అవసరమని తోచింది. "నువ్వు కూడా ఒక పద్యం చదవరా రాఘవా!" అన్నాడు. అంతకు ముందు కొంచెం సభాపిరికి ఉన్నవాడినే. పాడేపాటి ధైర్యం లేదు. అయినా నా ప్రత్యర్థికి వచ్చిన కీర్తి ప్రతిష్ఠలు చూచి

నాకూ కసిగా వుంది. మా మామయ్య ఆదేశం వినగానే ఝామ్మని పద్యం చదివేశాను మామూలుగా! అందరూ బాగావుందంటే ఉందన్నారు. వన్సమోర్‌లు వచ్చాయి. అక్కడినుంచి వరుసగా నాచేత, వేణుగోపాల్‌చేత పాడించారు మా పెద్దలు.

అంతవరకు నా పాట గురించి మా నాన్నగారి కేమీ తెలియదు. మా నాన్నగారు అసలు పిల్లల్ని దగ్గరికే చేరనిచ్చేవారుకాదు. అదంతా ఒక తరహాగా వుండేది. ఏడాదికో శివరాత్రి అన్నట్లు ఏడాదికోసారో, పుష్కరానికోసారో ఆయనతో మాట్లాడడానికి మాకు అవకాశం లభించేది. మాకు ఏ అవసరం వచ్చినా మా అమ్మతో చెప్పుకోవలసిందే కాని, ఆయన దగ్గరికి వెళ్ళి ఆయనతో మాట్లాడడానికి వీలులేదు. అలా అని ఆయన యింటివిషయాలేమీ పట్టించుకునేవారు కారనికాదు. ఆ యింట్లో ఏమిజరిగినా ఆయన చెవిని పడవలసిందే. ప్రవర్తనకు సంబంధించిన నియమాలు కొన్నింటిని (ఆయన విధించినవే) ఉల్లంఘించకుండా ఉంటే మేము ఏ ఆటలు ఆడుకున్నా, పాటలు పాడుకున్నా ఆయన లెక్కచేసేవారు కాదు. అనుమతి తీసుకుంటే ఎక్కడికైనా వెళ్ళవచ్చు. మరి దేనికీ బాధపడనక్కరలేదు. కూడదంటే కూడదు. ఇదంతా ఎందుకు చెప్పవలసివచ్చిందంటే ఆవిధంగా మాకు కొంత దూరంగా ఉంటూ ఉన్న కారణంచేతనే ఆ భోజనసమయంవరకు ఆయనకు నా పాట గురించి తెలియడానికి ఆస్కారంలేకుండా

పోయింది. ఆ సంగతి ఆయనకు తెలియడంల్ల నేనా గొప్పతనం మరింత ప్రచారంలోనికి రావడంకూడా జరిగింది. అది కూడా చెబుతాను.

## 3

నేను అప్పటికి రెండవఫారం చదువుతున్నా ననుకుంటాను. మా హైస్కూల్ హెడ్ మాస్టరు రిటైర్ అయ్యారు. ఆయనకు వీడ్కోలు యివ్వడానికి స్కూల్లో పెద్ద సభ జరిగింది. విద్యార్థులందరూ వీడ్కోలు పత్రాలు సమర్పించి, వీడ్కోలు 'నవరత్నాలు', 'మణిమంజరి' ల పేర్లతో పద్యాలు చదివి ఆయనపట్ల తమకు ఉన్న భక్తిప్రపత్తులు వెల్లడిచేసుకున్నారు. వారిలో నే నొకణ్ణి. అది ఈ విధంగా జరిగింది.

మా నాన్నగారు కూడా ఆ హెడ్మాస్టరు వద్దనే చదువుకున్నారట. అందులోనూ ఆయన శిష్యగణం అంతటిలోనూ అధికంగా ఆయన అభిమానానికి పాత్రమైనవారు మా నాన్నగారేనట. మా నాన్నగారు స్వయంగా కవులు. ఆ ఊరిలో కొంత గౌరవప్రతిష్ఠలు ఆర్జించుకున్నారు. అందుకని తమ గురువు గారికి తమ భక్త్యాంజలికూడా సమర్పిద్దామనుకొన్నారు. అది నాపరంగా జరిగితే ఆ పద్యాలు రచించినది ఎవరో ఎలాగూ తెలిసిపోతుంది కనుక హెడ్మాస్టరు ఇతోధికంగా ప్రీతి చెందుతారని మా నాన్నగారు తలంచారు. ఏమైనా ఆరోజు నన్ను పిలిచి, మూడు పద్యాలు ఉన్న పత్రం ఒకటి నాచేతికి ఇచ్చి, వాటిని సభలో చదవమని చెప్పారు. ఎన్నడూ మాట్లాడడం, అంతటి భారం

నాపై పెట్టడము నాకు మహా ఆనందం కలిగించినవి. ఒక రకంగా భయం కలిగించినా మొత్తంమీద సంతోషమే చాలపాళ్ళు ఎక్కువగా ఉన్నదని చెప్పక తప్పదు.

సభ జయప్రదంగా జరిగిపోయింది. అందరిలోకీ నాకే ఎక్కువ ప్రాముఖ్యం వచ్చింది. పద్యాలు చదివిన తతిమ్మా వారందరూ అలాంటి పనులకు అలవాటు పడినవారు కాక పోవడంమూలంగా వారు కొంత సభాపిరికి చూపారు పైగా ఆ హెడ్మాస్టరంటే సింహస్వప్నంగా అంతవరకు కాలం గడిపిన ఉపాధ్యాయులు, సీనియర్ విద్యార్థులు కావడంచేత మరీ కంగారు పడ్డారు. నా గొప్పతనం చూచుకుని మురిసి పోతున్నా నేమో, నదురూ బెదురూ లేకుండా పద్యాలు చదివేశాను. మా నాన్నగారు వ్రాసిన పద్యాలు కూడా హాస్య రసోత్పాదకంగాను, విషాదకరంగాను ఉండి రక్తి కట్టడంకూడా నాకే లాభించింది. దానా దీనా ఆ హైస్కూల్లో నేను గాయకుడుగా స్థిరపడిపోయాను. పని పడినప్పుడల్లా నేను పద్యాలు చదువుతూ ఉండడం పరిపాటి అయింది. అది నాకొక రకంగా గర్వకారణమైందని కూడా చెప్పక తప్పదు.

౪

నాలుగోఫారం చదువుతున్నాను. హైస్కూలు వార్షికోత్సవాలు సమీపిస్తున్నవి. ఆ ఏడాది కొత్తగా సంగీత పోటీలు ప్రవేశపెట్టారు. ప్రతి క్లాసుకు నోటీసు పంపారు— సంగీతంలో ప్రవేశం ఉండి పోటీ చేయగోరే విద్యార్థు లందరు

తమ పేర్లు ఆ యా తరగతుల ఉపాధ్యాయులద్వారా హెడ్మాస్టరుకు తెలియపరుచుకోవాలంటూ. నేనుకూడా నా పేరు ఇచ్చాను.

అది సంస్కృతంక్లాసు అనుకుంటాను. మా ఉపాధ్యాయుడు నా కేసి చూచి "మరి కర్ణాటక సంగీతంలో పోటీరా?" అన్నారు. "నువ్వు ఇంటివద్ద ఏమైనా సంగీతం అభ్యసిస్తున్నావటరా?" అని అడిగారు. క్లాసుల్లోకల్లా పేరు ఇచ్చినవాణ్ణి నే నొక్కణ్ణే. నాతో పోటీ చేయగలిగిన దమ్ము ఆ బడిలో ఎవరికి ఉంది? గర్వంతో మునిగి తన్మయుడనై ఉన్నాను. మాస్టారి ప్రశ్న సరిగా వినలేదు. వినపడినా ఆ ప్రశ్నకు సమాధానం ఇవ్వడం ఎందుకు అనుకున్నాను.

మా హైస్కూలుకు సంబంధించి ఉన్న కాలేజీలోనే మా అన్నయ్యలు ఇరువురుకూడా చదువుతున్నారు. ఒకరు బి. ఏ. రెండవసంవత్సరంలోను, మరొకరు మొదటిసంవత్సరంలోను ఉన్నారు. హైస్కూలు వార్షికోత్సవాల సంగతి, సంగీత పోటీల విషయము వారికి తెలుసు. కాని, ఆ పోటీలలో నేనుకూడా పాల్గొంటున్నాననే విషయం మాత్రం ఇంట్లో ఎవరికీ తెలియదు. ఏకంగా ఒకసారే బహుమతి చేత బట్టుకొనివచ్చి అందరికీ చెబుదా మనుకున్నాను.

సాయంకాలం అయిదు ఆరు గంటలకు సంగీత పోటీ ప్రారంభమైంది. హైస్కూలు మధ్యలో ఉన్న 'క్వాడ్రాంగులర్ హాలు' క్రిక్కిరిసి ఉంది. నా తరగతి బాలురు, నా మిత్రులు, అనుయాయులు ఒకచోట విడిగా గుమిగూడి కూర్చున్నారు. మొదట నలుగురయిదుగురు బాలురు

పాడారు. ఒక బాలుడు వీణమీద పాడాడు. కొందరు చప్పట్లుకొట్టి హర్షం వెలిబుచ్చారు. నా వర్గంవారు మాత్రం నిరుత్సాహంగా ఉన్నారు. ఆ పాటలు నాకు కూడా ఏమీ బాగాలేదు.

నా పేరు చదివారు. ఒక్క గంతువేసి రంగస్థలంమీద నిలబడ్డాను. ఎదురుగా దూరంలో మా అన్నయ్యల ముఖాలు కనపడుతున్నవి. ఆ నిమిషంలో నేను సరిగా తెలుసుకోలేకపోయాను. కాని వా రిరువురి ముఖాలు కొంచెం వెలవెలబోతున్నట్లు, నావంక జాలిగా చూస్తున్నట్లు అనిపించింది.

నోరు తెరచి పాడబోతూ వుంటే ప్రధాన నిర్ణయకుడుగా ఉన్న మా సంగీత శాస్త్రాచార్యులు కూర్చోమన్నాడు. ఇదేమిటి కూర్చోవడమేమిటి- తప్పదా అనుకుంటూనే తిరుగుబాటు చేయడానికి దమ్ములు లేక కూర్చున్నాను. ఉత్సాహం కొంత సన్నగిల్లినది. "కనకంపు బొమ్మనూ కనుగొన్నే కందోయి..." అంటూ కపిలవాయి పద్యం అందుకొన్నాను. ఝామ్మని పాడేస్తున్నాను. సభాసదుల ముఖాలు వెలవెలపోతున్నట్లు కనపడుతున్నది. అంతలో ఒకాయన లేచి - హెడ్మాస్టరు పక్కనే కూర్చుని ఉండడంచేత ఆయన నిర్ణయకులలో ఒకరు అనుకుంటాను - "ఆగు!" అన్నాడు. తెల్లబోయి ఆగాను. "నీకు కర్ణాటక సంగీతం వచ్చునా, రాదా?" అన్నాడు. అప్పటికీ "వచ్చునండీ!" అన్నాను. "అయితే ఒక కృతిమో, లేక స్వరమో ఏదో ఒకటి పాడు" అన్నారు. ఆసారి మాత్రం ముచ్చెమటలు పోసినవి. ఆయన చెబుతున్న

దేమిటో అర్థంకాలేదు. "రామనాథశాస్త్రి పద్యాలు చదవ కూడదాండీ!" అన్నాను. "పోనీ, సత్యహరిశ్చంద్రలో పద్యాలో ?" కూడదన్నాడు ఆయన. నేను అలాగే నిలబడి శూన్యంగా చూస్తున్నాను.

మా పెద్దన్నయ్య వేదిక దగ్గరికి వచ్చి "రాఘవరావు నా తమ్ముడండీ! వాడికి కర్ణాటక సంగీతంలో ప్రవేశమేమీ లేదు. తెలియక పోటీలో చేరాడు. క్షమించి వాడిపేరు తీసెయ్యండి!" అని హెడ్మాస్టరుతో అన్నాడు. ఆయన అంగీకారం తెలియపరచి క్రిందికి దిగిపొమ్మని సూచించారు. క్రిందికి దిగుతున్నాను సభ్యుల్లో ఒక్కసారి ఇకఇకలు, పకపకలు, నవ్వులు, చప్పట్లు ప్రారంభమైనవి. ఆకాశమే విరిగి మీద పడ్డదా అనిపించింది. అవమాన భారంతోను, దుఃఖంతోను ఈ సంగతి తెలిస్తే మా నాన్నగారు ఏమంటారో అనే భయంతోను క్రుంగిపోయాను.

ఆ విధంగా కర్ణాటక సంగీతము, శాస్త్రీయ సంగీతము అంటే ఏమిటో మొదటిసారి నాకు తెలిసివచ్చింది. నాలోని మధురభావమేదో నశించిపోయింది. అప్పుడే కాదు, ఆ తరువాత ఎన్ని సంవత్సరాలు అయినా, కర్ణాటక సంగీతం అభ్యసించడానికి మనస్కరించలేదు. అట్టి ఆసక్తి కాని, ఉత్సాహంకాని లేకపోయినవి.